సాక్షి
మంచిర్యాల
శుక్రవారం ♦ 10 ♦ మార్చి ♦ 2023



జీవాల వయస్సుకు తగ్గ మేత

గొర్రెలు, మేకలకు ఎంత దాణా ఇవ్వాలనేది పెంపకందారులు తెలుసుకోవాలి. సరైన మోతాదులో అందిస్తే బలిష్టంగా తయారవుతాయని జిల్లా పశువైద్యాధికారి సూచించారు. 8లో▸



కంటివెలుగు సద్వినియోగం

కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం ఆయన కన్నాలలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా ప్రవీణ్‌కుమార్



సీఐ ప్రవీణ్‌కుమార్



సీఐ మహేందర్‌రెడ్డి

మంచిర్యాలక్రైం: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల మహిళా పోలీసుస్టేషన్ సీఐగా టీ.ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. చెన్నూర్ టౌన్ సీఐగా పని చేస్తున్న ఆయనను మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రవీణ్‌కుమార్ గతంలో మంచిర్యాల రూరల్ సీఐగా, బెల్లంపల్లి సీఐగా, మంచిర్యాల ట్రాఫిక్ సీఐగా పని చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో తనదైన ముద్ర వేశారు.

సీఐల బదిలీ

చెన్నూర్: చెన్నూర్ సీఐగా ఎస్.వాసుదేవరావును నియమించారు. చెన్నూర్ సీఐ టి.ప్రవీణ్‌కుమార్‌ను మంచిర్యాల మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీ చేయగా, భూపాలపల్లిలో పని చేస్తున్న వాసుదేవరావును ఇక్కడికి బదిలీ చేశారు. ఈయన శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. **మందమర్రిరూరల్:** మందమర్రి సీఐ ప్రమోద్‌రావ్‌ను గోదావరిఖని వన్‌టౌన్ బదిలీ చేశారు. కాజీపేట్ సీఐ మహేందర్‌రెడ్డిని మందమర్రికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

జన్నారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర బృందం గురువారం తనిఖీ చేసింది. పొనకల్ ప్రాథమిక పాఠశాల, కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో ఆడిట్ చేశారు. అనంతరం పొనకల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థులకు గుడ్డు తప్పనిసరిగా అందించాలన్నారు. మన ఊరు–మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలగా మారుతున్నాయని అన్నారు. పొనకల్ పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుడు ప్రభాకర్ ఆంగ్లం బోధిస్తున్న విధానం చూసి అభినందించారు. ఈ సమావేశంలో పొనకల్, కిష్టాపూర్ గ్రామాల సర్పంచులు జక్కు భూమేశ్, కోల తార, ఎంఈవో విజయ్‌కుమార్, ఉప సర్పంచులు శ్రీనివాసగౌడ్, మల్లేశ్, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, హెచ్ఎంలు జాడి మురళి, శ్రీనివాస్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు రమేశ్, శ్రీనివాస్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం చలాన్ చెల్లించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో శ్యామలదేవి

బెల్లంపల్లి: ప్రభుత్వ, సింగరేణి లీజు భూమిలో స్థిర నివాసాలు కట్టుకుని డిమాండ్ నోటీసు అందుకున్న పురప్రజలు ప్రభుత్వానికి చలాన్ చెల్లించి భూమి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలదేవి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సింగరేణి కంపెనీ ప్రభుత్వానికి నిర్దేశించిన ప్రాంతాల్లో ఖాళీ, క్వార్టర్లు ఉన్న భూమిని కొంతమొత్తంగా రెవెన్యూ శాఖకు బదిలీ చేసిందని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన 76 జీవో ప్రకారం 100 గజాల కన్న భూమి అధికంగా ఉన్న వారు పట్టాల కోసం చలాన్ కట్టి ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందన్నారు. 100 గజాలలోపు స్థలం కలిగి ఉన్న వారు చలాన్ కట్టాల్సిన అవసరం లేదన్నారు. డిమాండ్ నోటీసులను అందుకున్న పురప్రజలు తహశీల్దార్ కార్యాలయంలో ఆధారాలతో విచారణ చేయించుకోవాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలి

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించేలా చొరవ తీసుకోవాలని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ రాజేందర్ అన్నారు. గురువారం సాయంత్రం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్, పంచాయతీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య పనులు, పంచాయతీ కార్యదర్శుల విధులపై అవగాహన కల్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శ్రీనివాస్, శిక్షకులు మల్లేశ్, సదానందం, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో గురుకులం



అద్దె భవనంలో కొనసాగుతున్న కాసిపేట బాలుర గురుకుల పాఠశాల



ఐదో తరగతి విద్యార్థులకు ఒకే గదిని డార్మెటరీ, క్లాస్ రూమ్‌గా వినియోగిస్తున్న దృశ్యం

- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా భవనాల నిర్మాణం చేపట్టకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో తొమ్మిది ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలు, డిగ్రీ కళాశాల ఉన్నాయి. బెల్లంపల్లి, కాసిపేట, జైపూర్, కోటపల్లి, మంచిర్యాలలో బాలుర, బెల్లంపల్లి, మందమర్రి(రామకృష్ణాపూర్), లక్సెట్టిపేట, చెన్నూర్‌లో బాలికల గురుకులాలు ఉన్నాయి. ఆయా గురుకులాలకు తోడుగా జిల్లా కేంద్రంలో సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. నిరుపేద, అట్టడుగు వర్గాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. కానీ సరైన వసతులు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలు అధ్వానంగా మారగా.. ప్రభుత్వం వీటిపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. గత్యంతరం లేక శిథిలావస్థలో ఉన్న, ప్రహరీ లేని, ఇతరత్రా వసతులు లేని భవనాల్లో విద్యార్థులు విద్యాభ్యాసం చేయాల్సి వస్తోంది. జిల్లాలోని పది గురుకులాల్లో ఐదు అద్దె భవనాల్లో కొనసాగుతుండడం గమనార్హం. 2016లో రాష్ట్ర వ్యాప్తంగా 103 సంక్షేమ గురుకుల విద్యాలయాలు ప్రారంభించగా.. అప్పటి నుంచి ఇప్పటివరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు పక్కాభవనాల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఎప్పటికప్పుడు పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. విద్యార్థుల సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం సానుకూలంగానే ఉంది. ఇప్పటికే మెస్‌చార్జీలను పెంచింది. ప్రాధాన్యత క్రమంలో పక్కాభవనాలను కూడా నిర్మించేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి.

– కె.స్వరూపారాణి, ఆర్సీఓ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

ఇదీ పరిస్థితి..

- మందమర్రికి మంజూరైన సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని ముందు చెన్నూర్ బాలికల గురుకులంలో ప్రారంభించారు. కొద్ది రోజుల తర్వాత రామకృష్ణాపూర్‌లో మూసివేతకు గురైన సింగరేణి పాఠశాల ఆవరణలోని మార్చారు. శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ భవనంలో భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇందులోనే విద్యాబోధన కొనసాగుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడే ప్రమాదం బారిన పడాల్సి వస్తుందోననే భయాందోళన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందిలో నెలకొంది. కనీసం ప్రహరీ కూడా లేకపోవడంతో రక్షణ కరువైంది.
- కాసిపేట గురుకుల పాఠశాలను వసతుల లేమితో బెల్లంపల్లిలో తాత్కాలిక ప్రాతిపదికన ప్రారంభించారు. శివాలయానికి వెళ్లే మార్గంలోని ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. రేకులతో కూడిన భవనం కావడంతో ఎండాకాలంలో విద్యార్థులు వేడిని తట్టుకోలేక తల్లడిల్లుతున్నారు. సరిపడా గదులు లేక తంటాలు పడుతున్నారు. మరోవైపు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేక.. రోజువారీగా అనధికారిక కరెంటు కోతలతో అవస్థలు పడుతున్నారు.
- మంచిర్యాల బాలుర గురుకుల పాఠశాలను ముందుగా గోదావరిరోడ్డులో ఉన్న ఓ అద్దె భవనంలో నిర్వహించారు. ఆ తర్వాత అక్కడి నుంచి గద్దెరాగడి ప్రాంతంలోని మరో అద్దె భవనంలోకి మార్చారు. ఇక్కడ విద్యార్థులకు సరిపడా వసతి లేకపోవడం శాపంగా మారింది. ఇరుకు గదుల్లో సతమతం అవుతున్నారు. జైల్లో ఖైదీలను కుక్కినట్లుగా దాదాపు 640మంది విద్యార్థులను చేర్చుకుని నరకయాతనకు గురి చేస్తున్నారు. విద్యార్థులకు కనీసం ఆటస్థలం కూడా లేని దుస్థితి నెలకొంది.
- కోటపల్లి మండలానికి మంజూరైన బాలుర గురుకుల పాఠశాలను అప్పటి పరిస్థితులు దృష్ట్యా జైపూర్ మండల కేంద్రానికి మార్చారు. అక్కడ ఓ అద్దె భవనంలో గురుకుల విద్యార్థులకు వసతి కల్పించి విద్యాబోధన సాగిస్తున్నారు. మౌలిక వసతులు నామమాత్రంగా ఉండడంతో విద్యార్థులకు సమస్యలే పాఠ్యాంశాలుగా మారుతున్నాయి.
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బాలికల గురుకుల డిగ్రీ కళాశాల పరిస్థితులు కూడా ఆశాజనకంగా లేవు. రెండు భవనాలను అద్దెకు తీసుకుని విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులకు ఆ భవనాలు కూడా సరిపోని ప్రతికూల పరిస్థితులు ఉండడంతో బాలికలు పడరాని పాట్లు పడుతున్నారు. అత్తెసరు మౌలిక వసతులతో అద్దె భవనాల్లో గురుకుల విద్యాలయాలు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. సొంత భవనాలకు నిధులు మంజూరు చేయించి వచ్చే విద్యాసంవత్సరం వరకైనా అందుబాటులోకి తేవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

‘మరుగు’నపడ్డ ఉచితం..!

- టెండర్లు పూర్తయి రెండున్నర నెలలు
- కాంట్రాక్టర్, అధికారుల మధ్య సమన్వయ లోపం
- ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల తిప్పలు



నిర్వాహకుడిని మందలిస్తున్న దేవపాల

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచిత మరుగుదొడ్డి సౌకర్యం మరుగునపడింది. టెండర్లు పూర్తయి రెండున్నర నెలలు గడుస్తున్నా పట్టింపు కరువైంది. అధికారులు, కాంట్రాక్టర్ మధ్య సమన్వయ లోపంతో ఉచిత మరుగుదొడ్డి ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ఆర్టీసీ మరుగుదొడ్లకు తాళాలు ఉండడంతో ప్రయాణ ప్రాంగణంలోనే ఉన్న మరుగుదొడ్డికి వెళ్తే నిర్ణీత రుసుం కంటే అదనంగా వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణ ప్రాంగణంలో ఉచిత మరుగుదొడ్డికి యాజమాన్యం నిర్ణయించి నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగించాలని భావించింది. డిసెంబర్ 11నుంచి 21వరకు దరఖాస్తులు స్వీకరించింది. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించింది. బస్‌స్టేషన్ శుభ్రం, ఊడువడానికి పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ఉచిత మరుగుదొడ్డి వైపు చర్యలు కరువయ్యాయి. అటు ఆర్టీసీ యాజమాన్యం ఇటు కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ఉచిత మరుగుదొడ్డి సౌకర్యం అందుబాటులోకి రానుందని ఇదివరకు సంస్థ పరిధిలోని మరుగుదొడ్లకు తాళం వేసి ఆరునెలలు గడిచిపోయింది. దీంతో ప్రయాణ ప్రాంగణంలోనే నిర్మల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీవోటీ కింద నిర్మించిన మరుగుదొడ్లను వినియోగించుకోవాల్సి వస్తోంది. మూత్రశాలలు ఉచితం కాగా, మరుగుదొడ్లను వినియోగిస్తే రూ.3 తీసుకోవాల్సి ఉంది. కానీ రూ.10 వసూలు చేయడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదనపు వసూలుపై ప్రయాణికుడు సాజిద్‌ఖాన్ గురువారం ఫిర్యాదు చేయగా ఆర్టీసీ అధికారులు స్పందించారు. మరుగుదొడ్ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు జరిమానా విధించారు. మరోసారి ఇదే తీరుగా ఉంటే మరుగుదొడ్లను మూసివేయిస్తామని అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల మందలించారు. నిర్ణీత రుసుం కంటే ప్రయాణికులు ఒక్క రూపాయి కూడా ఎక్కువ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

వడ్డీ వచ్చింది..



వడ్డీ చెక్‌ను అందిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు(ఫైల్)

- స్వయం సహాయక సంఘాలకు విడుదల
- సంఘాల ఖాతాల్లో జమ

పాతమంచిర్యాల: స్వయం సహాయ సంఘాల సభ్యులకు ప్రభుత్వం వడ్డీ మంజూరు చేసింది. సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీని తిరిగి మహిళా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ చేస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు పావలా వడ్డీకే రుణాలు అందజేసి మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం అందించారు. ఆ తర్వాత కాలంలో ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణ పథకాన్ని తీసుకొచ్చింది. అప్పటి నుంచి మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే.. వారు చెల్లించిన మొత్తానికి వడ్డీని కలిపి వారి పొదుపు ఖాతాల్లో జమ అవుతోంది. కాగా, 2018 నుంచి 2022వరకు ప్రభుత్వం మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ జమ చేయలేదు. దీంతో మహిళా సంఘాలు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి విన్నవిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ రెండేళ్ల (2018–19, 2019–20)కు సంబంధించి వడ్డీ నిధులు విడుదల చేసిందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి బి.శేషాద్రి తెలిపారు. 2020–21, 2021–22 సంవత్సరాలకు సంబంధించిన వడ్డీ విడుదల కావాల్సి ఉంది. జిల్లాలో 8,459 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.12 కోట్ల 62 లక్షల 37వేలు విడుదల చేసింది. ఆయా సంఘాల ఖాతాల్లో జమ చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

స్వయం సహాయ సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం ప్రోత్సాహకంగా వడ్డీ ఇస్తోంది. ఇది పేద మహిళలకు వరం లాంటిది సద్వినియోగం చేసుకోవాలి. రుణాలు సకాలంలో చెల్లించని సంఘాలు వడ్డీ పథకానికి అర్హత సాధించలేరు. రుణాలు సకాలంలో చెల్లించి ఎలాంటి బకాయిలు లేని సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. – బి.శేషాద్రి. డీఆర్‌డీవో

రుణాలు చెల్లించాలి

స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణ ప్రణాళికల ద్వారా వారి అవసరాలకు తీసుకున్న రుణాలు సకాలంలో వాయిదాలు చెల్లించాలి, రుణ వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా వడ్డీ చెల్లిస్తుంది. – శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీవో

సంతోషంగా ఉంది..



మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉంది, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు వడ్డీలేని రుణ పథకంలో మంజూరైన వడ్డీ విడుదల చేయడంతో సంఘాల సభ్యులలో ఆనందం వ్యక్తమవుతోంది.

– సత్యవతి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు

జల్సాల కోసం వరుస చోరీలు



పట్టుబడ్డ నిందితుడితో కమిషనర్ రెమా రాజేశ్వరి, పోలీసులు

- నస్పూర్‌లో పగటి దొంగ అరెస్టు
- 72 కేసుల్లో నిందితుడు
- దొంగిలించిన సొత్తు విలువ రూ.కోటీ 20లక్షలు
- నాలుగు మోటారుసైకిళ్లు, కారు, ట్రాలీ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి

నస్పూర్: జల్సాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యానికి అలవాటు పడి వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని నస్పూర్ పోలీసులు అరెస్టు చేశారు. వివిధ పోలీసు స్టేషన్లలో 72 కేసుల్లో నిందితుడిగా ఉన్న అతడు రూ.కోటీ 20లక్షల విలువైన సొత్తు దొంగిలించాడు. గురువారం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరుకు చెందిన రాజవరపు వెంకటేష్ మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని షిర్కే కాలనీలో 1145 నంబరు క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు. కొన్నేళ్ల క్రితం శ్రీరాంపూర్‌కు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. మద్యం, చెడు అలవాట్లు, ఆన్‌లైన్ బెట్టింగ్, విలాసవంతమైన జల్సాలకు అలవాటు పడి ఖర్చుల కోసం దొంగతనాలు చేస్తున్నాడు. 2019లో మొదటిసారిగా చోరీకి పాల్పడ్డాడు. దొంగిలించిన ఆభరణాల్లో కొంత సొత్తు ముత్తూట్, శ్రీరామ్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టగా వచ్చిన సొమ్ముతో మణుగూరులో ఓ ఇల్లు కొన్నాడు. మరికొంత సొమ్ము ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఉపయోగించాడు. ఇలా సుమారు రూ.కోటి వరకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టాడు. నిందితుడు వెంకటేష్ పేరిట మూడు బ్యాంకు ఖాతాలు ఉండగా, ఒంటరిగా, ఎక్కువగా పట్టపగలు దొంగతనాలకు పాల్పడేవాడు. సీసీ కెమెరాలు, జనసంచారం ఎక్కువగా లేని ఏరియాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని చోరీ చేసేవాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తన సిబ్బందితో కలిసి గురువారం ఉదయం ఏడు గంటలకు సీసీసీ రాయల్ గార్డెన్ చౌరస్తాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసులను గమనించిన నిందితుడు ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు పట్టుకుని విచారణ చేయగా గతంలో చేసిన నేరాలను అంగీకరించాడని సీపీ తెలిపారు. సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్‌లో 7, లక్సెట్టిపేటలో 6, చెన్నూర్‌లో 7, మందమర్రిలో 11, రామకృష్ణాపూర్‌లో 17, కాసిపేటలో 2, శ్రీరాంపూర్‌లో 1, మంచిర్యాలలో 5, గోదావరిఖని వన్‌టౌన్‌లో 14, భీమారం పోలీసుస్టేషన్‌లో 2 కేసులు ఉన్నాయని వివరించారు. నిందితుడు 72 కేసుల్లో దొంగిలించిన సొత్తు 2.89 కిలోల బంగారం, 4.07కిలోల వెండి, రూ.19లక్షలు నగదు మొత్తం విలువ రూ.కోటీ 20లక్షలు ఉంటుందని తెలిపారు. నాలుగు మోటారుసైకిళ్లు, కారు, ట్రాలీ స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని రిమాండ్ తరలించనున్నామని చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, మంచిర్యాల ఏసీపీ బి.తిరుపతిరెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ టి.సంజీవ్, సీసీసీ నస్పూర్ ఎస్సై బి.రవికుమార్, హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్, ఏఎస్సై టి.జితేందర్‌సింగ్, కానిస్టేబుళ్లు బి.శ్రీనివాస్, బి.రవిలను కమిషనర్ అభినందించారు.

మంచిర్యాలను సుందరంగా తీర్చిదిద్దుతాం

- సెంట్రల్ లైటింగ్‌కు నిధులు విడుదల
- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఇందుకోసం ప్రభుత్వం నుంచి కోట్లాది నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాతమంచిర్యాల నుంచి తోళ్లవాగు వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం, డ్రెయినేజీ నిర్మాణం, రోడ్డు వెడల్పు చేపట్టేందుకు సీఎం కేసీఆర్ రూ.15.14 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గత నెలలోనే మంచిర్యాల పట్టణంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో డివైడర్ల నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వాలు ఏనాడూ మున్సిపాలిటీల అభివృద్ధిని పటించుకోలేదని, ప్రతిపక్ష పార్టీలు అనవసరపు విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. ఇకనైనా ప్రతిపక్ష నాయకులు ఆలోచించి మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

12న డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఆర్డీవో వేణు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మావతి గార్డెన్స్‌లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని, అర్హులై టోకన్లు పొందిన లబ్ధిదారులు టోకెన్లు, ఆధార్‌కార్డు ప్రతులతో ఉదయం 10 గంటలకు రావాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మహిళల పేరిట కేటాయించనున్నందున తప్పనిసరిగా మహిళలు రావాలని తెలిపారు. దరఖాస్తుదారులలో గతంలో ప్రభుత్వ హౌసింగ్ పథకాలలో లబ్ధి పొందిన 43 మందికి ఇచ్చిన టోకెన్లు రద్దు చేశామని, ఈ విషయమై సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. దరఖాస్తుదారులు తప్పుడు సమాచారం ఇచ్చి, లాటరీ ద్వారా ఇల్లు కేటాయించినా రద్దు చేస్తామని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

6,090 మందికి కంటి పరీక్షలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో గురువారం 6,090 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 26వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్ నాంపల్లి మాధవి ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా జరిపిన కంటి పరీక్షల్లో 978 మందికి రీడింగ్ కళ్లద్దాలు అందించగా, ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్‌ను 1,100 మందికి అందించేందుకు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేశారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

క్లుప్తంగా

ఆటో బోల్తాపడి ఒకరు మృతి


బాలునాయక్ (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలంలోని చింతగూడకు చెందిన బాలునాయక్ (56) గురువారం ఉదయం సొంత పని నిమిత్తం ఉట్నూర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కి ఇంటికి వస్తుండగా ఇందన్‌పల్లి సమీపంలో ఆటో ముందుటైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో బాలునాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అందులో ప్రయాణిస్తున్న మరో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. మృతునికి భార్య సూరబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

చెన్నూర్‌రూరల్: ఆస్నాద సమీపంలో గురువారం ట్రాలీ ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొక్కూరు నుంచి ఆస్నాద వైపు వెళ్తున్న ట్రాలీఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న వరిపొలాల్లో పడి పోయింది. ఆ సమయంలో ఆరుగురు ప్రయాణికులు ఉండగా కిష్టస్వామి, ఆశయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు.

పలువురిపై తేనెటీగల దాడి

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో పలువురిపై తేనెటీగలు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పిట్టల లక్ష్మయ్య గురువారం మృతి చెందారు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్తుండగా శవయాత్రలో పాల్గొన్న పలువురిపై తేనె టీగలు దాడిచేశాయి. సుమారు 20 మందిపై దాడి చేయడంతో గాయాలపాలైనట్లు స్థానికుల ద్వారా తెలిసింది. బాధితులు లక్సెట్టిపేట, ధర్మపురి, దండేపల్లి ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకున్నట్లు సమాచారం.

చెరువులకు బౌండరీలు ఏర్పాటు చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జన్నారం: మండలంలో కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో చెరువులకు బౌండరీలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. గురువారం మండలంలోని సింగరాయిపేట చెరువు, పొనకల్ చెరువులను ఆర్డీవో వేణుతో కలిసి పరిశీలించారు. చెరువులపై తహసీల్దార్ వెంకటకిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని కిష్టాపూర్, ఒడ్డెపల్లి చెరువు, సింగరాయిపేట్, పొనకల్ చెరువులకు బౌండరీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జీవాల వయస్సుకు తగ్గమేత

- పౌష్టికాహారంతో జీవాలు బలిష్టం
- ముక్కలుగా చేసి అందిస్తే మేలు


గొర్రెలు, మేకలు

మంచిర్యాలఅగ్రికల్చర్: గొర్రెలు, మేకలకు ఏ వయసులో ఎంత దాణా ఇవ్వాలి.. ఎండుగడ్డి, పచ్చిగడ్డి ఎంత మోతాదులో అందించాలి.. అనే విషయాలను పెంపకందారులు తెలుసుకోవడం చాలా అవసరం. మూగజీవాల వయసును బట్టి సరైన మోతాదులో ఆహారం అందిస్తే అవి బాగాఎదిగి బలిష్టంగా తయారవుతాయని, ఎండుమేతైనా, పచ్చిమేతైనా ముక్కలుగా చేసి అందిస్తే మేలని జిల్లా పశువైద్యాధికారి వై.రమేశ్‌కుమార్ సూచిస్తున్నారు.

గొర్రె పిల్లలకు..
తల్లి పాలు తాగే వయసులో గొర్రె పిల్లలు కొరికి తినేందుకు వీలుగా ఎండిన లెగ్యూమ్ జాతి పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచాలి. 6 నుంచి 8 వారాల వయసు పిల్లలకు మధ్యగడ్డి, పప్పుజాతి ఎండుగడ్డి, నలగ్గొట్టిన గింజలు ఇవ్వాలి. 8 వారాల దాటిన తర్వాత తల్లి నుంచి పిల్లలను వేరు చేస్తారు. ఆ దశలో వాటికి క్రీపు దాణాను అందిస్తే త్వరగా ఎదుగుతాయి. ప్రతీరోజు ఒక్కో గొర్రె పిల్లకు 250 నుంచి 450 గ్రాముల దాణా, 2 కిలోల పచ్చిమేత అందేలా చూడాలి.

ఎదకు వచ్చిన సమయంలో..
గొర్రె ఎదకు వచ్చి పొర్లే సీజన్‌లో పప్పు జాతికి చెందిన ఎండుగడ్డితో పాటు రోజుకు 100 గ్రాముల ధాన్యపు గింజలు లేదా శరీర బరువులో 10వ వంతు పచ్చిమేత, 100 గ్రాముల వేరుశనగ చెక్క అందించాలి.

చూడికట్టిన సమయంలో..
చూడికట్టిన గొర్రెలకు సరైన మేత అందిస్తే పుట్టే పిల్లలు బలంగా ఉంటాయి. పాల దిగుబడి పెరుగుతుంది. అందుకే తినగలిగినంత ధాన్యపు జాతి పశుగ్రాసంతో పాటు రోజుకు 50 గ్రాముల వేరుశనగ చెక్క (పల్లిపొట్టు)అందించాలి. లేదంటే పొలాల్లో లభించే పంట అవశేషాలతో పాటు 100 గ్రాముల వేరుశనగ చెక్క అందించాలి.

నీటిని అందించడం ఇలా..
సాధరణంగా జీవాలకు వాటి శరీర బరువులో 10 శాతం నుంచి 12 శాతం నీరు అవసరమవుతుంది. కాబట్టి ప్రతీరోజు ఒక్కో జీవానికి సూమారు 5 లీటర్ల నీటిని అందుబాటులో ఉంచాలి. ఫారాల్లో మేత తొట్లను ఏర్పాటు చేసినట్లు నీటితొట్లను కూడా ఏర్పాటు చేయాలి.

ఈత సమయంలో..
గొర్రె ఈత సమయంలో ఆహారంలో ధాన్యపు గింజల పరిమాణం తగ్గించి నాణ్యమైన ఎండుమేత అందించాలి. ఈనిన తర్వాత నుంచి వారం రోజుల పాటు తౌడు, గింజల్ని 50 శాతం చొప్పున ఇవ్వాలి. పాలిచ్చే గొర్రెలకు ప్రతీరోజు 450 గ్రాముల ఎండుమేత , 250 గ్రాముల ధాన్యపు జాతి గింజల చొప్పున ఇవ్వాలి. లేదంటే 10 కిలోల పశుగ్రాసం అందించాలి. రెండేళ్ల పైబడిన తర్వాత మేతతో పాటు ప్రతీరోజు 500 నుంచి 1000 గ్రాముల దాణా ఇవ్వాలి. పిల్లలు పుట్టిన తర్వాత 5 రోజుల పాటు జున్ను పాలు తాగించాలి. ఆ తర్వాత శరీర బరువులో 1/6వ వంతు చొప్పున నెల రోజుల పాటు పాలు తాగించాలి. రెండో నెల నుంచి శరీర బరువులో 1/15వ వంతు చొప్పున ఇవ్వాలి. పుట్టిన 2వ వారం నుంచి పిల్లలకు రుచికరమైన స్టార్టర్ దాణా, పచ్చిమేత ఇవ్వాలి. 3 నెలల వయసు నిండిన పిల్లలకు పాలు ఇవ్వడం మానేయాలి. 50 శాతం జొన్న, 25శాతం తౌడు, 12శాతం వేరుశనగ చెక్క, 11వెన్న తీసిన పాలపొడి, 2 శాతం ఖనిజ లవణ మిశ్రమంతో తయారు చేసుకున్న స్టార్టర్ దాణా అందించాలి. గొర్రెలు, మేకలకు దాణాతో పాటు ఖనిజ లవణ మిశ్రమం ఇవ్వడం వల్ల అవి ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. జీవాలు త్వరగా ఎదకు వస్తాయి. స్టాండర్డ్ కంపెనీలు చేసిన మిశ్రమాన్ని 2 శాతం మేర దాణాలో కలపాలి. లేదా విడిగా కూడా ఇవ్వవచ్చు. దాణాలో 1శాతం రాళ్ల ఉప్పును కూడా కలుపాలి.

75 శాతం సబ్సిడీపై విత్తనాలు



స్వీట్‌సూడన్ గ్రాస్ ఎస్ఎస్‌జీ 898 రకం 5 కిలోల బ్యాగులను ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తోంది. ఎకరాకు 15 కిలోల చొప్పున విత్తుకోవాలి. నాలుగు తడుల నీటితో 30 రోజుల చొప్పున నాలుగు సార్లు కటింగ్‌కు వస్తుంది. 30 నుంచి 40 టన్నుల వరకు పచ్చిమేత, 15 నుంచి 20 టన్నుల వరకు ఎండు గడ్డి దిగుబడి వస్తుంది. పూత దశకు వచ్చే సమయంలో కోతకోసి వాముగా నిల్వచేసుకోవచ్చు.

– జిల్లా పశువైద్యాధికారి

ముక్కలు చేసి మేపాలి

పచ్చిమేత, ఎండుమేతలను అలాగే మేపితే జీవాలు వాటిని పూర్తిగా తినవు. పచ్చి పశుగ్రాసాల కాండాలు, చొప్పదంట్లు పెద్దవిగా లావుగా, ఆకులు వెడల్పుగా పొడవుగా ఉండడమే కారణం. జీవాలు కేవలం లేత ఆకుల్ని మాత్రమే పూర్తిగా తిని కాండాలు, దంట్లను వదిలేస్తాయి. అంతే కాకుండా వాటిని తొక్కి పాడుచేస్తాయి. మరోవైపు చొప్ప వంటి ఎండుమేత కొరత కూడా రోజురోజుకూ పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మేతను పూర్తిగా వినియోగించుకోవాలి. ఇందుకు మేతను చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించి మేపాలి. ఫారాల్లో పెంచే గొర్రెలు, మేకలకు పశుగ్రాసాన్ని చిన్నచిన్న ముక్కలుగా చేసి అందించడానికి చాఫ్ కట్టర్, దాణా తయారు చేసుకోవడానికి గ్రైండర్ కమ్ మిక్సర్ ఉపయోగపడుతాయి. జొన్న, సజ్జ, మొక్కజొన్న చొప్పలను ఎండుమేతగా ఉపయోగించుకోవచ్చు.

పాఠశాలలు సందర్శించిన రాష్ట్ర బృందం


భీమిని పాఠశాలలో బృందం సభ్యులు

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం రాష్ట్ర పరిశీలన బృందం సందర్శించింది. సభ్యులు పాఠశాలలో రికార్డులు, మార్కుల నమోదు ప్రక్రియ, తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాసాగర్ అన్నారు. అనంతరం భీమిని ఉన్నత పాఠశాలతో పాటు జగ్గయ్యపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో పీఎంకేవీవై 4.0 షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. పదోతరగతి, ఐటీఐ పూర్తి చేసిన, ఐటీఐ మధ్యలో ఆపేసిన 16 నుంచి 45 సంవత్సరాల అభ్యర్థులు అర్హులన్నారు. ఎలక్ట్రిక్ డొమెస్టిక్ సొల్యూషన్, సోలార్ ఎల్ఈడీ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, వెబ్ డెవలపర్ కస్టమైజ్డ్ కోర్స్, వెల్డర్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

‘సుగుణ’కు సుష్మాస్వరాజ్ అవార్డు


అవార్డు అందిస్తున్న బండి సంజయ్

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన మహిళా రైతు నందుర్క సుగుణ సుష్మాస్వరాజ్ అవార్డుకు ఎంపికైంది. నాగసముద్రం గ్రామానికి చెందిన సుగుణ వ్యవసాయంలో సేంద్రియ సాగుతో పాటు విభిన్న రకాల పంటలు పండించి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆమెను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. తెలంగాణ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

ట్యాక్స్ చెల్లించని ఇసుక ట్రాక్టర్లు సీజ్


నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్లు

నెన్నెల(బెల్లంపల్లి): జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య ఆదేశాల మేరకు గురువారం నెన్నెలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్యాక్స్ చెల్లించకుండా ఆన్‌లైన్ ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక ఫ్లో ట్రాక్టర్, ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు మంచిర్యాల అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యూష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను రిలీజ్ చేయాలంటే ట్యాక్స్‌తో పాటు పన్నుపై 200 శాతం పెనాల్టీ కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. వాహనదారులు తమంతట తామే ట్యాక్స్ చెల్లించి పెనాల్టీ నివారించుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా అన్ని ధ్రువపత్రాలు ఉన్న ట్రాక్టర్లకే ఆన్‌లైన్‌లో ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాల్సిన మైనింగ్ శాఖ ప ట్టుబడ్డ ఈ ట్రాక్టర్లకు ఆన్‌లైన్ అనుమతి ఎలా ఇచ్చిందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రాణహిత సరిహద్దులో విస్తృత తనిఖీలు


వేలిముద్రలు సేకరిస్తున్న సీఐ విద్యాసాగర్

కోటపల్లి/వేమనపల్లి: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న ప్రాణహిత నదీ తీరప్రాంతాల్లో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, నీల్వాయి ఎస్సై నరేశ్, కోటపల్లి ఎస్సై వెంకట్ ఆధ్వర్యంలో రాచర్ల, వెంచపల్లి, జనగామ, ఆలుగామ గ్రామాలను సందర్శించి ఫెర్రీ పాయింట్లతో పాటు వంతెనల వద్ద సోదాలు నిర్వహించారు. అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు వివరాలు సేకరించారు. సరిహద్దు భద్రతపై గ్రామస్తులతో చర్చించారు. అనంతరం నదిలో చేపలు పట్టేవారితో మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు సరిహద్దులో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చిన అనుమానితుల వేలిముద్రలను సేకరించి వివరాలు నమోదు చేసుకున్నారు.

జిల్లా కేంద్రంలో చోరీకి యత్నం


పట్టుబడిన నిందితుడు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ సమీపంలో సోలంకి రమేశ్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీకి యత్నించిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సదరు వ్యక్తి కాళ్లకు సంచులు కట్టుకుని చప్పుడు కాకుండా ఇంట్లోకి ప్రవేశించాడు. గమనించిన పెంపుడు కుక్కలు అరవడంతో మేలుకున్న రమేశ్ ఇద్దరు కుమారులు దొంగను పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం ఫిర్యాదు చేసేందుకు రమేశ్ భార్య పావని పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా సదరు దొంగ కనిపించలేదు. పోలీసులను ప్రశ్నించగా అతనికి మతిస్థిమితంలేదని, లారీ ఎక్కించి మహారాష్ట్రకు పంపించామని సమాధానం ఇచ్చారు. దొంగ పిచ్చివాడయితే పిచ్చాసుపత్రికి పంపించాలని, లారీలో ఎక్కించి మహారాష్ట్ర పంపించడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల తీరుపై బాధితులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్సై రమేశ్‌ను సంప్రదించగా దీనిపై తమకు ఫిర్యాదు రాలేదన్నారు.

ఎడ్లబండిని ఢీకొని వ్యక్తి మృతి

సిర్పూర్(టి): ద్విచక్ర వాహనంతో ఎడ్లబండిని ఢీకొన్ని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం హుడ్కిలి గ్రామానికి చెందిన చౌదరి జనార్దన్(45) కామ్డె దేవాజి బుధవారం రాత్రి బైక్‌పై హుడ్కిలి నుంచి దుబ్బగూడవైపు వెళ్తుండగా ఎడ్లబండిని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా జనార్దన్ అప్పటికే మృతి చెందాడు. తీవ్రగాయాలైన దేవాజీని కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం మంచిర్యాలకు తరలించారు. మృతుని కుమారుడు జగదీశ్ ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా ఎడ్లబండి నడపడమే కాకుండా రాంగ్‌రూట్‌లో వచ్చి మృతికి కారణమయ్యాడని తోర్ సంతోశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): భూమి హద్దు విషయంలో తీవ్రంగా దూషించడంతో మనస్తాపానికి గురై వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై భూమేశ్ తెలిపారు. మండలంలోని కొండపల్లికి చెందిన బుర్స బాపు (62), అదే గ్రామానికి చెందిన లొండి పుల్లుబాయికి మధ్య భూమి హద్దు విషయంలో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం సైతం అదే హద్దు విషయంలో పుల్లుబాయి దూషించటంతో బాపు బాధపడుతూ ఇంటికి వచ్చాడు. విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కుమారుడు భీంరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య


గనుజీ (ఫైల్)

బెల్లంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గురువారం ఓ వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ అవుట్ పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గంగారాంనగర్‌లో నివాసం ఉంటున్న మోచి వృత్తిదారుడు కామ్లే గనుజీ (77) బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

జైపూర్(చెన్నూర్): మండలం ఇందారం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన నాగులమల్యాల రాజమౌళి, గజ్జి రాజయ్య గురువారం పనినిమిత్తం మంచిర్యాల జిల్లాలోని ముల్కల్లకు కారులో వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా ఇందారం క్రాస్‌రోడ్డు సమీపంలో కారు అదుపుతప్పి సెంట్రల్ లైటింగ్ నిమిత్తం ఏర్పాటు చేసిన దిమ్మలకు ఢీకొని బోల్తా పడింది. ఇద్దరికి గాయాలు కావడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

తొలగించిన డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి


దీక్షలో పాల్గొన్న కాంట్రాక్టు డ్రైవర్లు

శ్రీరాంపూర్(మంచిర్యాల): తొలగించిన డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట కాంట్రాక్టు డ్రైవర్లు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ క్వాలిటీ జీఎం కారుడ్రైవర్ హుస్సేన్‌ను ఇటీవల అకారణంగా తొలగించారన్నారు. డ్రైవర్ విధులే కాకుండా తన ఇంటి పనులు కూడా చేయాలని సదరు అధికారి, వారి కుటుంబం వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దీన్ని ప్రశ్నిస్తే విధుల్లోంచి తొలగించారన్నారు. సదరు అధికారి తీరుకు నిరసన వ్యక్తం చేస్తే 10 మంది డ్రైవర్లపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. పెట్టిన కేసులను ఎత్తివేసి వెంటనే డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకునేంత వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి సీసీసీ పోలీస్ స్టేషన్‌లో సదరు అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు పెండం శివ, బండి తిరుపతి, హుస్సేన్, శ్రీకాంత్, అఖిల్, వినోద్, లక్ష్మణ్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు హెచ్ఐవీ, టీబీ పరీక్షలు


మాట్లాడుతున్న సుబ్బరాయుడు

లక్సెట్టిపేట(మంచిర్యాల): జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గురువారం లక్సెట్టిపేటలోని సబ్‌జైలులో ఖైదీలకు హెచ్ఐవీ, టీబీ, సుఖవ్యాధులు, హెపటైటిస్(బి), (సి), సంబంధిత వ్యాధులకు సంబంధించి రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఖైదీలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఫయాజ్‌ఖాన్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, సబ్ జైలు అధికారి స్వామి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అశోక్

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గొర్రెల కాపరులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. 60 ఏళ్లు నిండిన కాపరికి నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని తెలిపారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున షీప్ ఫాం అభివృద్ధి చేసి రుణాలు అందించాలని కోరారు. ఇందుకోసం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి యాదవులకు వివరించాలని విన్నవించారు. 80 శాతం సబ్సిడీపై గేదెలు అందించాలని కోరారు. వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

‘గురుకులం’ను సందర్శించిన సివిల్ జడ్జి

లక్సెట్టిపేట(మంచిర్యాల): పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను గురువారం సివిల్ జడ్జి మారెంరెడ్డి అర్పిత సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలు బోధించారు. యువతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, దురలవాట్లకు గురైతే కలిగే దుష్పరిణామాలు, వాటి పర్యావసనాలకు లోనవుతున్న టీనేజ్ బాలికల తీరు, జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి మారెంరెడ్డి అర్పిత

నిరవధిక దీక్ష భగ్నం


విజయధర్మాను అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై

జన్నారం(ఖానాపూర్): అక్రమ పట్టాదారులపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకుడు, చింతగూడ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ విజయధర్మా గురువారం తలపెట్టిన నిరవధిక దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఇటీవల తపాలపూర్‌కు చెందిన ఇద్దరు అధికారపార్టీ ప్రజాప్రతినిధులు సింగరాయిపేట్ సీలింగ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నట్లు రుజువైనా వారిపై చర్యలు తీసుకోకపోవడంతో దీక్షకు పూనుకున్నారు. దీక్షలో పాల్గొనేందుకు వస్తుండగా బస్టాండ్ సమీపంలో ఎస్సై సతీశ్ అడ్డుకుని ముందుగా లక్సెట్టిపేట్ పోలీస్ స్టేషన్‌కు, అక్కడి నుంచి జన్నారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం జన్నారం పోలీస్ స్టేషన్‌లో దీక్ష చేస్తున్నట్లు విజయధర్మా ప్రకటించారు.